క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అధికారులు





కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాసరావు, రమణమూర్తి

కాకినాడ సిటీ: జిల్లా ఉపాధి, శిక్షణ అధికారిగా నియమితులైన జి.శ్రీనివాసరావు సోమవారం జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లాలో ఉపాధి, శిక్షణ అధికారిగా పని చేస్తున్న శ్రీనివాసరావు సాధారణ బదిలీలో భాగంగా కాకినాడ జిల్లాకు వచ్చారు.

కాకినాడ సిటీ: జిల్లా ఎస్సీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్, ఎంపవర్‌మెంట్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డీవీ రమణమూర్తి సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

సత్రం ఈఓగా మోర్త



సత్రం ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న మురళీవీరభద్రరావు

కరప: వేళంగి గ్రూపు దేవాలయాలకు చెందిన పాతూరి బుల్లివెంకాయమ్మ సత్రం ఈఓగా మోర్త మురళీవీరభద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవదాయ శాఖ బదిలీలలో భాగంగా కాకినాడ భానులింగేశ్వరస్వామి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న మురళీవీరభద్రరావు వేళంగికి వచ్చారు. ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న భీమేశ్వరస్వామి దేవాలయం(కాకినాడ) ఈఓ ఆర్.రాజేశ్వరరావు నుంచి చార్జ్ తీసుకున్నారు. అందరి సహకారంతో సత్రం భూముల పరిరక్షణకు, అభివృద్ధికి కృషి చేస్తానని ఈఓ తెలిపారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



సియాదుల పాపకు పింఛను ఇస్తున్న వలంటీర్ భవాని

కరప: కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి గ్రామ వలంటీర్ సోమవారం పింఛను అందజేశారు. నడకుదురు గ్రామానికి చెందిన సియాదుల పాప చెయ్యి విరిగిపోవడంతో కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం గ్రామ వలంటీర్ బొబ్బిలి భవానికి చెప్పడంతో సోమవారం ఆమె కాకినాడ ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేశారు.

ఎంఎస్ఎన్‌లో సెన్సార్ గేమింగ్



సెన్సార్ గేమింగ్ ప్రారంభిస్తున్న ఆదినారాయణ

బాలాజీచెరువు: నేటి తరం విద్యార్థులు మొబైళ్లలో ఆటలకు బానిసవుతున్న నేపథ్యంలో సెన్సార్ గేమ్ ద్వారా ఫిజికల్ గేమింగ్ లోకి మార్చడానికి ఎంఎస్ఎన్ పాఠశాలలో సెన్సార్ గేమింగ్ ఏర్పాటు చేశారు. ఈ గేమ్‌ను పాఠశాల కరస్పాండెంట్ ఆదినారాయణ ప్రారంభించి, ఈ గేమ్ ద్వారా ట్యాబ్, సెల్‌ఫోన్లలో ఆడే ఆటలకు బదులు ఈ ఆటలు ఆడటం ద్వారా విద్యార్థులకు శారీరక ఆరోగ్యంతో పాటు వినోదాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల డైరెక్టర్ సుజ్ఞాన్, ప్రకాష్ ఈ స్పోర్ట్స్ ఏరీనా, నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి 7 రోజులు జైలు, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ నాలుగో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిరుపా భాంజ్ డియో సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఎర్నిటి సింహాద్రి, నంబుల గణేశ్ మణికంఠ దుర్గా ప్రసాద్, పేర్ల రాజు, వల్లూరి శ్రీనివాస రామకృష్ణ చౌదరి మద్యం సేవించి వాహనంపై వెళుతుండగా తిమ్మాపురం ఎస్సై పర్యవేక్షణలో బీచ్ రోడ్డులో పోలీసులు వీరిని పట్టుకున్నారు. నలుగురు మద్యం తాగి వాహనం నడుపుతున్నారని గుర్తించి, కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో ఏడు రోజుల జైలు శిక్ష, రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బాడుగ బాదుడు

- అద్దెలతో వలస జీవుల సతమతం
- నెలసరి వేతనంలో సగం వ్యయం
- ఏటా పెంచుతున్నా తప్పని భారం



బోట్‌క్లబ్: జిల్లాల పునర్విభజన.. జిల్లా కేంద్రం.. పారిశ్రామికంగా.. విద్య, వైద్య పరంగా దినదినాభివృద్ధి.. ప్రతి రంగంలో ముందంజ.. ఇవి ఉపాధి అవకాశాలకు అవసరమైన ప్రధాన లక్షణాలు. ఇటువంటి ప్రాంతాలకు సహజంగానే వలసలు ఎక్కువగా ఉంటాయి. వారందరికీ నివాసాలు అమరడం పెద్ద సమస్య. నగరంలో సుమారు ఐదు లక్షలుపైగా జనాభా ఉన్నారు. వీరు కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కాకినాడకు వలస వచ్చిన వారు మరో లక్షకు పైమాటే. సప్లై తక్కువ ఉండి డిమాండ్ ఎక్కువ ఉన్నచోట ధర ఎక్కువ పలకడం సహజ సూత్రం. ఇంటి అద్దెల విషయంలో అదే జరుగుతోంది. చిన్న ఇంటికి సైతం సగటు ఉద్యోగి జీతంలో సగం అద్దెకే చెల్లించాల్సిన పరిస్థితి.

బహుళ అంతస్తులకే ప్రాధాన్యం

ఒక స్థలంలో చిన్న ఇల్లు కట్టి అద్దెకు ఇచ్చే కంటే అదే స్థలంలో బహుళ అంతస్తులు నిర్మించి ఎంతో మందికి అద్దెలకు ఇచ్చి ఆర్జించాలనేది ప్రస్తుతం ట్రెండ్. దీంతో బిల్డర్లు సైతం ఆ దిశగా మొగ్గు చూపుతున్నారు. పరిశ్రమల్లోని ఉద్యోగులతో పాటు, పిల్లల చదువుల కోసం, వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు వచ్చిన వలసవాసుల కోసం ఇటువంటి అపార్ట్‌మెంట్లకు కొదవులేదు. కానీ వాటిలో అద్దెకు ఉండాలంటే కనీసం రూ.పది వేలు చెల్లించనిదే దొరకడం లేదు.

కరోనా అనంతరం పెరిగిన అద్దెలు

నగర శివార్లలోనే తట్టుకోలేని అద్దెలు ఉంటే, నగరం మధ్యలో ఇల్లు అద్దెకు కావాలంటే రూ.13 వేల పైమాటే. సామాన్య, మధ్య తరగతివారు ఎంతో భారం మోయాల్సిన పరిస్థితి. పైగా ఏటేటా అద్దె పెరిగేదే కానీ, తరిగేది కాదు.

కరోనా కాలంలో ఎంతో మంది ఉపాధి కోల్పోవడంతో స్వస్థలాలకు వెళ్లిపోయారు. దీంతో అద్దెల ఆదాయం పడిపోయి ఇళ్ల యజమానులు సైతం ఆదాయాలు తగ్గిపోయి కుటుంబ ఖర్చుల అంచనాలు తప్పిపోయి చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి చక్కబడింది. మళ్లీ ఉపాధి వెతుక్కుంటూ ఎక్కడెక్కడి నుంచో ప్రజలు కాకినాడకు చేరుకున్నారు. దీంతో మళ్లీ అద్దె ఇళ్లకు డిమాండ్ పెరిగింది. మూడేళ్ల క్రితం రూ.7 వేల నుంచి రూ.8 వేల మధ్య ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నేడు రూ.12 వేల వరకు చేరింది.

పిల్లల చదువుకోసం వచ్చాం



మాది పెద్దాపురం మండలం కట్టమూరు. పిల్లలు చదువుకోసం పదేళ్లుగా ఇక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నాం. అప్పట్లో రూ.3 వేలుకు డబుల్ బెడ్‌రూం ఇల్లు దొరికేది. ప్రస్తుతం భాస్కర్‌నగర్ ఉంటున్న మా ఇంటి అద్దె రూ.12 వేలు. ఏటా పెరుగుతున్నా భరించాల్సిన పరిస్థితి.

– బిక్కిన విశ్వేశ్వరరావు

ఎక్కువ పెంచితే నోటీసు పంపవచ్చు



పరస్పర అంగీకారం, అగ్రిమెంట్ ప్రకారం ఏటా అద్దె పెంచాల్సి ఉంటుంది. ఒకేసారి ఎక్కువ పెంచితే ఇంటి యజమానికి నోటీసు పంపవచ్చు. ఇళ్లు అద్దెకు తీసుకొనే ముందుకు అద్దెకు దిగేవారు ఏడాదికి ఎంత శాతం పెంచుతారో తెలుసుకొని అద్దెకు దిగాలి.

– వెలిగొట్ల శ్రీనివాస్, న్యాయవాది

ఆలోచింపజేసిన చిత్రలేఖన పోటీలు



విద్యార్థులు గీసిన చిత్రం

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు చిత్రలేఖనం పోటీలు ఆలోచింపజేశాయి. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, మొక్కలు నరికి వేయడం వల్ల కలిగే నష్టాలు వంటి వాటిపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 134 మంది విద్యార్థులు పాల్గొనగా ముఖ్య అతిథిగా టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు ఇన్‌చార్జి రాజశేఖర్ హాజరై బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బాలల సైన్స్ కో–ఆర్డినేటర్ వెంకట్రావు, కేసరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సుబ్బరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.

పంచారామ క్షేత్రంలో భక్తుల రద్దీ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం అధిక సంఖ్య భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారు జామున స్వామివారికి మహారాజా గోత్రనామాలతో అర్చకులు తొలిపూజ చేశారు. తరువాత భక్తుల అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దేవస్థానం తరుపున అన్నదానం చేశారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు. పూజలు అనంతరం మధ్యాహ్నం స్వామివారిని అమ్మవార్లను ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయంలోని ఉప ఆలయాలోను అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వరద నీరు పోయే మార్గం ఏదీ?



వెలంపేట డ్రైను ఆక్రమణ తొలగించాలని కోరుతున్న వీరాస్వామి

కాకినాడ సిటీ: యు.కొత్తపల్లి మండలం గోర్సలో ఊర చెరువు మార్గం ద్వారా వరద, మురుగు నీరు పోతుండగా ఆ మార్గాన్ని సరిహద్దు రైతు మూసివేయడంతో మా తాలూకు భూముల్లో మురుగు, వదర నీరు నిలిచిపోవడంతో పంటలు పాడైపోతున్నాయని గోర్సకు చెందిన పెదిరెడ్ల వీరాస్వామి వెల్లడించారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఇలక్కియను కలసి తమ గోడును విన్నవించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నా పొలానికి దక్షిణం వైపు కతారి రాజబాబుకు, నా భూమికి మధ్య పంట కాలువ, తూర్పున ఊర చెరువు ఉందన్నారు. వెలంపేట డ్రైను నీరు, వరదలు వచ్చినప్పుడు వరద నీరు పోయేందుకు కొంత జిరాయితీ భూమి ఉందన్నారు. ఆ మార్గం సమీపంలో ఉన్న రైతులు మూడు అడుగుల మేర మెరక చేయడం వల్ల ఊర చెరువు వరదనీరు పోయే మార్గం మూసుకుపోయిందని వీరాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. తాను జిరాయితీ మార్గంలో రెండు అడుగుల లోతు, మూడున్నర అడుగుల వెడల్పున మురుగునీరు పోయే మార్గంగా కాలువ తవ్వించానన్నారు. అయితే తవ్విన కాలువను జబర్‌దస్తీగా జేసీబీ తీసుకొచ్చి పూడ్చి వేశారన్నారు. అధికారులు నా భూమిలో మురుగు, వరద నీరు పోయే మార్గంగా కాలువ ఆక్రమణలు తొలగించాలని జేసీ, ఆర్డీవోలను కోరుతూ వినతిపత్రం అందజేసినట్టు వీరాస్వామి తెలిపారు.

కార్పొరేషన్‌లో ‘స్పందన’

అర్జీలు స్వీకరించిన అదనపు కమిషనర్



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు వినతులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజినీరింగ్ సహా వివిధ విభాగాలకు సంబంధించి అదునపు కమిషనర్‌కు ఆరు వినతులు అందాయి. ఆయా విజ్ఞప్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికాలను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క అర్జీకి నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు అందజేయవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ ఎస్సీ సత్య కుమారి, స్మార్ట్ సిటీ ఈఈ వెంకట్రావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీఈలు, ఈఈలు, సచివాలయం సిబ్బంది, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులను అందజేస్తున్న ఉపసర్పంచ్ అయ్యన్న

కరప: వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం ఐదు మ్యాచ్‌లు జరిగాయి. అండర్–19 విభాగంలో వేళంగి జట్టుపై జగన్నాథగిరి జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మణికంఠ(జగన్నాథగిరి) నిలిచాడు. నో ఏజ్‌లిమిట్ విభాగంలో జరిగిన మొదటి మ్యాచ్‌లో వేళంగి జట్టుపై ఓదూరు జట్టు గెలుపొందింది. రెండోమ్యాచ్‌లో ఉండూరు జట్టుపై కరప జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా మధు(కరప) నిలిచాడు. మూడో మ్యాచ్‌లో వేళంగి టీమ్‌పై ఓదూరు టీమ్ విజయ కేతనం ఎగురవేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నరేష్(ఓదూరు) నిలిచాడు. నాలుగో మ్యాచ్‌లో వేళంగి వెటరన్స్ జట్టుపై పెద్దాపురప్పాడు జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నవీన్(పెద్దాపురప్పాడు) నిలిచింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డులను విజేతలకు గ్రామ ఉపసర్పంచ్ కుంచే అయ్యన్న అందజేశారు.

పాత్రికేయుల సేవలు అభినందనీయం



మజ్జిగ, స్వీట్లను పంపిణీ చేస్తున్న కృష్ణప్రకాష్ తదితరులు

కాకినాడ సిటీ: ప్రజలకు ఉపయోగపడే సేవలు అందిస్తున్న పాత్రికేయులు అభినందనీయులని కాకినాడ రోటరీక్లబ్ గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు, కాకినాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో కాకినాడ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రానికి మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాహైల్‌తో కలిసి హాజరై మజ్జిగ పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు. కలెక్టరేట్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మజ్జిక అందజేశారు. అంతేకాకుండా దివంగత మంగా బుల్లి అబ్బాయి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మంగా వెంకట శివరామకృష్ణ చలివేంద్రానికి అందజేసిన స్వీట్లను కూడా పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వంకాయల శ్రీరామ్మూర్తి, ఉద్దండ ఉమాగౌరీ, జర్నలిస్టులు అంజిబాబు, వల్లిపల్లి సత్యనారాయణ, మజ్జిగ పంపిణీకి సహకరించారు.

ఎన్ఎంఎంఎస్‌కు బచ్చు ఫౌండేషన్ విద్యార్థి ఎంపిక



గోర్త హర్షవర్ధన్

సామర్లకోట: ఎన్ఎంఎంఎస్ పథకానికి స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి గోర్త హర్షవర్ధన్ ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ పూర్తి అయ్యే వరకూ నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఆర్థిక సహాయం అందుతుందని హెచ్ఎం సాయిరామకృష్ణ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్కలను పంపిణీ చేస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు



నడకుదురులో ఉద్యోగులతో కలిసి పారిశుధ్య పనులు చేస్తున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు



క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి తదితరులు

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కొన్ని సంవత్సరాలుగా మనం వ్యవహరిస్తున్న తీరు వల్ల పర్యావరణానికి నష్టం కలుగుతోందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందన్నారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రఘురామ్, సువర్ణ, పద్మావతి, హనురాజ్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో పర్యావరణ పరిరక్షణ

కరప: పర్యావరణ పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం నడకుదురులో గ్రామ కార్యదర్శి పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడారు. వాతావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు అందరూ మొక్కలు నాటాలన్నారు. తర్వాత పంచాయతీ సిబ్బంది, ఉద్యోగులు పారిశుధ్య పనులు నిర్వహించారు. పెద్దాపురప్పాడు, గురజనాపల్లి, ఉప్పలంక, కరప తదితర గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉద్యోగులతో కలిసి ప్రకృతిని ప్రేమించండి, పర్యావరణాన్ని రక్షించండి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు దేగల లలితకుమారి, బిరుదా శ్రీనివాస అప్పారావు, ఎ.శ్రీనివాసరావు, బొమ్మిడి నయోమి, సాదే ఆశాజ్యోతి, కార్యదర్శులు ఎస్కే నాగేంద్రకుమార్, డి.దుర్గాభవాని, వి.సునీల్ పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్‌లో..

కాకినాడ రూరల్: కాకినాడ ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కమలకుమారి ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం పోచయ్య, ఎస్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ ఎం.నానిబాబు,



ఆర్ఎంసీ ఆవరణలో మొక్కలు నాటుతున్న వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, చిత్రంలో డీఎంఈ డాక్టర్ నరసింహం

అధ్యాపకులు డాక్టర్ అప్పారావు, డాక్టర్ శ్రీరామరాజు, డాక్టర్ గోపి, డాక్టర్ హరిబాబు, రధమాధవి, హేమలత, దుర్గా భవాని తదితర బోధన బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రమణయ్యపేటలో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గ్రామ మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ మాట్లాడుతూ మానవ జీవితంలో పర్యావరణ ప్రయోజనాలు పెనవేసుకున్నందున ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. ఈ సందర్భంగా కోరమాండల్ మహిళా క్లబ్ మొక్కలు పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ సృజన, అంజుమ్, మోహిని కుమారి, చింతపల్లి సుబ్బారావు, ఎస్.శ్రీనగేష్, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రీయల్ పార్కులో జోనల్ కార్యాలయం ప్రాంగణం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ మేనేజర్ బడగల హరిధర్ మాట్లాడుతూ పర్యావరణ హితం కోరి ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడంతోపాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు.

వైద్య కళాశాలలో..

కాకినాడ క్రైం: ప్లాస్టిక్ రహితమే హితమనీ అదే పర్యావరణ పరిరక్షణకు మార్గమని రాష్ట్ర వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ), రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి అన్నారు. సోమవారం ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో 200 మంది యూజీ, పీజీ విద్యార్థులు అధ్యాపకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జీజీహెచ్ ప్రాంగణంలో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఘనంగా జరిగింది.

మహిళా కళాశాలలో..

కాకినాడ సిటీ: ఒన్ స్టెప్ టువార్డ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆసియాలోనే ప్రథమ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 600 మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు జోగా రామకృష్ణ మాట్లాడుతూ కాకినాడలో ఉన్న అన్ని ప్రభుత్వ సంస్థలను పచ్చదనంతో సుందరంగా తయారు చేయడమే లక్ష్యంగా ఒన్‌స్టెప్ టువార్డ్స్ సొసైటీ పని చేస్తుందన్నారు. సంస్థ ప్రతినిధులు ఆనంద్, రామరాజు, తమ్మారావు, జీపీడీ పీడీ భాషా, ఉద్యోగులు, ఆర్ఎంసీ పారా మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో...

కాకినాడ లీగల్: కాకినాడ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల కమిషన్ కోర్టు ఆవరణలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ఉష లక్ష్మీకుమారి, వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు వసంతకుమార్ ముఖ్యఅతిథులుగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం స్థానిక కచేరిపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్యానెల్ న్యాయవాది కె.నాగజ్యోతి ఆధ్వర్యంలో బాలల సంఘంతో ర్యాలీ నిర్వహించారు.



రమణయ్యపేటలో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ

పాదాంబిక అమ్మవారికి మహా నివేదన



గొల్లప్రోలులో అమ్మవారికి మహా నివేదన

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో వేంచేసిన పాదాంబిక అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి మహా నివేదన (తిరుప్పావడ సేవ)కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి పులిహోర రాశిగా పోసి జిలేబీలు, అరిసెలు, పొంగడాలు, వివిధ రకాల పండ్లు అలంకరించి రాశి ముందు క్షీరాన్నం ఉంచి అమ్మవారికి నివేదించారు. అనంతరం వాటిని భక్తులకు ప్రసాదంగా పంచారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహాన్నదానం నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆదివారం అమ్మవారికి మల్లెపూలు, గులాబీలు, సంపెంగి పూలతో కవాటబంధనం చేశారు. సోమవారం తెల్లవారుజామున తిరిగి అమ్మవారి గర్భాలయాన్ని తెరచారు. సుగంధ పరిమళాల నడుమ అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు.